## క్లుప్తంగా

### కాశీపురంలో ఉచిత వైద్య శిబిరం నేడు

**దేవరాపల్లి:** మండలంలోని కాశీపురం లోటస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు బీఆర్‌డీఎస్ స్వచ్ఛందం చైర్మన్ రాపేటి కొండలరావు తెలిపారు. స్థానిక స్కూల్ ప్రిన్సిపాల్ పాపారావు, ఆదర్శ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బి.ఎస్. త్రినాథరాజు, రిటైర్డ్ ఎస్‌డబ్ల్యూవో ఆదిరెడ్డి చినకన్నబాబు, కొట్టాన రాంబాబు మాస్టారు సహాయ సహకారాలతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ఆర్ఐ హాస్పిటల్, బీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో కళ్లు, గుండె, మూత్రపిండాలు, గైనకాలజీ, మూల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

### వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర ఉత్సవాలు



స్వామి వారి పవిత్ర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

**నర్సీపట్నం :** పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి పవిత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 12వ తేదీ వరకు జరగనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ బ్రహ్మలింగేశ్వరస్వామి తెలిపారు. విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. స్వామివారి శాంతి కళ్యాణంతో ఉత్సవాలు ముగిస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### పిల్లలతో తల్లి అదృశ్యం



అదృశ్యమైన భూలక్ష్మి, పిల్లలు(ఫైల్)

**యలమంచిలి రూరల్:** పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలు అదృశ్యం కావడంపై ఆమె భర్త మరిసా వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ కె.సావిత్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంనగర్‌లో వెంకటేశ్వర్లు భార్య భూలక్ష్మి(30), కుమార్తె హేమ వర్షితశ్రీ(8), కుమారుడు దక్షర్(6)తో నివసిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 5 గంటలకు వెంకటేశ్వర్లు డ్యూటీకి వెళ్లి మరునటి రోజు ఉదయం 10.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇల్లు తాళం వేసి ఉండడంతో తన భార్య, పిల్లలు ఎక్కడికి వెళ్లారని ఇంటి యజమానిని అడగ్గా.. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో పుట్టింటికి వెళ్తున్నట్టు చెప్పారని ఇంటి యజమాని తెలిపాడు. అనంతరం వెంకటేశ్వర్లు అత్తింటికి ఫోన్ చేయగా తమ వద్దకు రాలేదని చెప్పారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

**గొలుగొండ :** గొలుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చిట్టింపాడు రోడ్డు, ఏటిగైరంపేట, జోగుంపేట, గుండిపాల ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీలు చేసి విడిచిపెట్టడం జరిగింది. రికార్డులు లేని వాహనదారులకు జరిమానాలు వేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని పోలీసులు సూచించారు.

### ఓటుచోరీపై కాంగ్రెస్ పార్టీ సంతకాలు సేకరణ



అర్జునగిరిలో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

**చీడికాడ :** ఓటుచోరీపై మండలంలోని అర్జునగిరిలో కాంగ్రెస్ పార్టీ నేతలు శనివారం సంతకాలు సేకరణను చేపట్టారు. ఈ మేరకు మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా ఓటుచోరీ జరుగుతుందని కాంగ్రెస్‌పార్టీ నేత రాహుల్‌గాంధీ యాత్ర ద్వారా ప్రజలకు తెలియజేసారన్నారు. వారి సూచనల మేరకు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిళ ఆదేశాలతో గ్రామాల్లో సంతకాలు సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చీకటి పరదేశి, మురుకుర్తి అప్పారావు, పిల్ల అప్పరావు పాల్గొన్నారు.

# వైద్యుల సమ్మెతో అందని 104 సేవలు

- సమ్మెలో పాల్గొన్న కింతలి పీహెచ్‌సీ వైద్యులు
- వైద్య సిబ్బందితో గ్రామాల్లో వైద్య సేవలు



కె.జె.పురం పీహెచ్‌సీ వద్ద వున్న 104 వాహనాలు

**మాడుగుల రూరల్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు సమ్మెతో గ్రామాల్లో 104 సేవలు పూర్తి స్థాయిలో అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలో పనిచేసే వైద్యాధికారులు తమ న్యాయమైన కోర్కెలు సాధన కోసం ఈ నెల 1 వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. దీనిలో భాగంగా మండలంలో కె.జె.పురం, కింతలి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వున్నాయి. కె.జె.పురం పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు సమ్మెలో పాల్గొనలేదు. వారు తమ విధులను యథావిధిగా నిర్వహిస్తున్నారు. అయిన ఈ పీహెచ్‌సీలో పనిచేసే వైద్యాధికారులు ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదు పాత్రుడు తో పాటు డాక్టర్ సందీప్ విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ సందీప్‌ను డిప్యూటేషన్‌పై చీడిగుమ్మల పీహెచ్‌సీకి వేశారు. వైద్యుల సమ్మె వల్ల ఈ సర్దుబాటు చేశారు. ఈ పీహెచ్‌సీలో పనిచేసే అయుష్ వైద్యాధికారి వి. శ్రీదేవిని కింతలి పీహెచ్‌సీకి డిప్యూటేషన్ మీద వేశారు. ఈ పీహెచ్‌సీలో పనిచేసే ఇద్దరు వైద్యాధికారులు సమ్మెలో ఉన్నారు. కాగా పీహెచ్‌సీల్లో ఒక్కో వైద్యాధికారి విధులు నిర్వహించడం వల్ల గ్రామాల్లో జరిగే ఫ్యామిలీ ఫిజిషియన్ (104 సేవలు)కు ఆటంకం ఏర్పడింది. ప్రతి నెలలో ఏదో ఒక గ్రామంలో వైద్య సేవలు అందించాలి. వైద్యాధికారి, ఆయా సచివాలయం ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, కలిపి వైద్య సేవలు అందించనున్నారు. అయితే 104 వాహనాలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు అయా గ్రామాల్లోకి వెళ్లి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు బీపీ, సుగర్, వ్యాధిగ్రస్తులను పరీక్షించి, మందులు అందజేస్తున్నారు. ఈ వాహనాలు వైద్యులు సమ్మె చెయ్యక ముందు ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు అయా గ్రామాల్లో వైద్య సేవలు అందించే వారు. దీంతో ఇప్పుడు వైద్యుల సమ్మెతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించి వారి సమ్మెను విరమింప చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రేషన్ డిపో మంజూరు కోరుతూ ధర్నా రేపు

**దేవరాపల్లి :** చింతలపూడి పంచాయతీకి ప్రత్యేక రేషన్ డిపో మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నాను చేపడుతున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న తెలిపారు. చింతలపూడి సచివాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. చింతలపూడి పంచాయతీ పరిధిలోని సమ్మెద, వీరభద్రపేట, బల్లిపురం, నేరెళ్లపూడి, బోడిగరువు, మదనగరువు, కొక్కిలబంద, జారురాయి కొత్తవలస, కొత్తూరు, కోరాడ, చింతలపూడి, వంతివానిపాలెం గ్రామాలలోని గిరిజన ప్రజలంతా తామరబ్బ పంచాయితీలోని ముకుందపురం రేషన్ డిపోకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకన్న

చింతలపూడి పంచాయతీలోని కొన్ని గ్రామాల ప్రజలు సుమారు 12 కిలో మీటర్లు మేర వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. దీంతో ప్రతి నెలా రేషన్ కోసం రోజంతా పనులు మానుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ డిపో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్నామని సీపీఎం నేత వెంకన్న స్పష్టం చేశారు.

## బీసీ హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**రావికమతం :** మండల కేంద్రంలో బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు రక్షణ కల్పించాలని శనివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాలికల హాస్టల్‌కు తక్షణమే ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, లేదంటే విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.గోవిందరావు మాట్లాడుతూ బాలికల హాస్టల్‌కి సరైన ప్రహరీ లేకపోవడంతో పిచ్చికుక్క చొరబడి 12 మంది విద్యార్థినులను గాయపరిచింది. హాస్టల్‌కు సరైన ప్రహరీ లేకపోవడం విడ్డూరమని, దీనిపై జాయింట్ కలెక్టర్‌తో సమగ్ర విచారణ జరిపించాలని బాలికలకు రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎస్. వలసయ్య, పాంగి చంద్రయ్య పాల్గొన్నారు.

## బాణసంచా సామగ్రి గొడౌన్ తనిఖీ

**నాతవరం :** ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎలాంటి అనుమతులు లేకుండా దీపావళి పండగకు మందుగుండు సామగ్రిని విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని నాతవరం తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, ఎస్ఐ వై.తారకేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో గల అయ్యప్ప మందుగుండు సామగ్రి విక్రయ గొడౌనును శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గొడౌనులో సామగ్రిని రికార్డులను స్వయంగా పరిశీలించి నిర్వాహకుడికి పలు సూచనలు చేశారు. ఇటీవల కాలంలో నిర్లక్ష్యం కారణంగా పలు ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న సంఘటనలు గుర్తు చేశారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మందుగుండు సామగ్రి విక్రయించే గొడౌను తనిఖీలు చేశామన్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు, నిబంధనలు అనుసరించి సామగ్రి విక్రయాలు ఉండాలని నిర్వాహకులకు తెలియజేసామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ జేఈ వేంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి లాలం శేషు వీఆర్వో బాబు సిబ్బంది ఉన్నారు.



మందుగుండు సామగ్రి గొడౌనులో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

## పొలాల్లో ధాన్యం, నాటుకోళ్లు అపహరణ

**బుచ్చెయ్యపేట :** బుచ్చెయ్యపేట, శింగవరంలో గుర్తు తెలియని వ్యక్తులు రైతుల ధాన్యం, నాటుకోళ్లు, మేకపోతును పట్టుకుపోయారు. శుక్రవారం రాత్రి సుంకరి, శనివాడ వారి పొలాల్లో ఉన్న పాకల వద్ద నుంచి రైతులు తమ ఇళ్లకు వచ్చేశారు. శనివారం ఉదయం రైతులు తమ పాకల వద్దకు వెళ్లి చూడగా పాకల్లో ఉంచిన ధాన్యం బస్తాలు, గంపలు కింద దాచిన నాటుకోళ్లను దొంగలు పట్టుకుపోయినట్టు గుర్తించారు. బుచ్చెయ్యపేటకు చెందిన సుంకర నాగరాజువి 3 ధాన్యం బస్తాలు, 8 కోడి పుంజులు, సుంకర కొండబాబుకు చెందిన 6 ధాన్యం బస్తాలు, 6 కోడి పుంజులు, సుంకర అప్పారావు, చినబాబు, శ్రీనులకు చెందిన రెండు పుంజులు, రెండు పెట్టలను పట్టుకుపోయారు. గ్రామంలోనే పోలీస్‌స్టేషన్ ఉన్నా దొంగలు ధాన్యం బస్తాలు, నాటుకోళ్లు అపహరణకు గురికావడంతో రైతులు విస్మయం చెందుతున్నారు. ఎల్.శింగవరం గ్రామానికి చెందిన రేణం రాము ఇంటి ముందు కట్టిన మేకపోతును కూడా దొంగలు పట్టుకుపోయారు. సుమారు లక్ష రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగినట్టు బాధిత రైతులు వాపోతున్నారు.



బుచ్చెయ్యపేటలో బాధిత రైతులు

## భూ సమస్యపై కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

**మాడుగుల రూరల్ :** ఉరవలోవకొండ భూ సమస్యపై కూటమి నాయకులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశాలను అడ్డుకుంటున్నారని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె. భవానీ శనివారం కె.జె.పురంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఒమ్మలి, వీజేపురం, ఎం.కృష్ణాపురం, రావికమతం మండలంలో కొమిర గ్రామాలకు చెందిన 6వ విడత భూ పంపిణీలో ఉరవలోవకొండకు చుట్టూ 450 మందికి పట్టాలు ఇచ్చిన భూములకు సర్వే నంబర్లు సరి చేయడం కోసం, గ్రామ సభలు జరిపి, వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని, గత నెల 27 వ తేదీన జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా దానిపై కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుని, పేదలకు న్యాయం చేస్తామని చెప్పడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికే సీసీఎల్ఏ ఆదేశాలతో కలెక్టర్ గతంలో పట్టాలు ఇచ్చిన అందరికీ సర్వే నెంబర్లు సరిచేసి, పట్టాలు ఇవ్వని వారిని గుర్తించి, పట్టాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా దానిని అడ్డుకుని పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. గతంలో తహసీల్దారు, కలెక్టర్‌కు దీనికి సంబంధించి వినతిపత్రాలు అందజేసామన్నారు. గత 15 సంవత్సరాలుగా సీపీఎం, ప్రజా సంఘాలు ఈ సమస్యపై ఆందోళన చేస్తున్నామని, గతంలో పట్టాలు ఇచ్చిన వారి పేర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చినా కూటమి నాయకులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి, నర్సీపట్నం ఆర్డీఓ, స్థానిక తహసీల్దారు, జిల్లా కలెక్టర్ ఆదేశాలను చెత్తబుట్టలో వేశారని అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, కూటమి నాయకులు కలెక్టర్‌తో మాట్లాడామని, ఉరవకొండ బాధితులకు న్యాయం చేస్తానని గ్రామాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కలెక్టర్ ఆదేశాలను అమలు చేయాలని, ఉరవలోవకొండ భూ సమస్య పరిష్కారం చేసి, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వెంకన్న, నర్సింహమూర్తి, భవానీ

### 6ఏ కేసు బియ్యానికి 14న వేలం పాట

**నాతవరం :** మండలంలో ఇటీవల అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడి 6ఏ కింద కేసు నమోదు చేసిన బియ్యానికి ఈనెల 14వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. ఆయన శనివారం దీనికి సంబంధించి ప్రకటనలో తెలిపారు. నాతవరం మండలం డి.యర్రవరం గ్రామంలో గల పౌరసరఫరాల గిడ్డంగి వద్ద భద్రపరిచిన బియ్యం 215 బస్తాలను కలెక్టరు జాయింట్ కలెక్టరు ఆదేశాలు అనుసరించి బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఈ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ వేలం పాటలో ఆసక్తి గలవారు ముందుగా గిడ్డంగిలో గల నిల్వ చేసిన బియ్యాన్ని చూసుకోవచ్చునన్నారు. అదే విధంగా వేలం పాటు తాలుకా ఇతర వివరాలను నాతవరం తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. వేలం పాటకు సంబంధించి సర్క్యులర్ మండల పరిషత్ కార్యాలయంతో పాటు సచివాలయంలో గల నోటీసులు బోర్డులో ప్రదర్శించామన్నారు.

### బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నాం



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న శేఖర్, శ్రీనివాసరావు

**కె.కోటపాడు :** పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో వారి బోధనా సమయం హరించుకుపోతుందని అనకాపల్లి జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.శేఖర్, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆదేశాల మేరకు బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు తెలుపుతూ ఎంఈవో సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. బోధనేతర పనులు కాని, గూగుల్ షీట్స్‌ను పూర్తి చేయడం, జీఎస్టీ 2.0, సీజనల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించబోమని తెలిపారు. ఉపాధ్యాయులు బి.శివప్రసాద్, సూర్రెడ్డి బాబూరావు, ఐ.అశోక్‌కుమార్, బోకం ప్రసాద్ పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల్లో బాలికల దినోత్సవం



కె.జె.పురం 1 వ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాల్స్

**మాడుగుల రూరల్ :** అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కె.జె.పురం 1 వ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చిన్నారులకు ప్లకార్డులు అందజేసి బాల్య వివాహాలు వద్దు, ఆడపిల్ల సృష్టికి మూలం అంటూ నినాదాలు ప్రదర్శించారు. చిన్నారుల తల్లిండ్రులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు.

### ఘాట్‌రోడ్డు జంక్షన్లో వీధి శునకాల బెడద

**మాడుగుల:** మండలంలో ఏ గ్రామం చూసినా ఊర కుక్కలు స్వైర విహారం చేస్తున్నారు. రాత్రయితే చాలు జనాన్ని వెంబడించి కరుస్తున్నాయి. మాడుగుల ప్రధాన జంక్షన్ తో పాటు ఘాట్‌రోడ్ జంక్షన్‌లలో మకాం వేసి గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. గత ఏడాదిగా ఇదే పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. తెల్లవారు ప్రయాణికులు జంక్షన్‌కు రావడానికి శునకాలు ఎక్కడ దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపైనా శునకాలు దాడి చేస్తుండడంతో తల్లిదండ్రులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఊరకుక్కల నియంత్రించాలని కోరుతున్నారు.

### జీడితోటల్లో జోరుగా గొప్పు పనులు

**రోలుగుంట :** మండలంలో జీడితోటల్లో గొప్పుల (మొక్క మొదళ్ల చుట్టూ) పనులు జరుగుతున్నాయి. వరి, చెరకు తరువాత రైతు కుటుంబాలకు కాస్త ఆదాయం తెచ్చిపెట్టేది జీడితోటలే. మండలంలో 910 హెక్టార్ల పైనే జీడితోటలు సాగవుతున్నాయి. ప్రతి ఏడాది ఈ తోటల్లో సెప్టెంబర్ ఆఖరి వారం, అక్టోబర్ నెలల్లోను తోటలో బలిసిన తుప్పలు తొలగించి, జీడి మొక్కల మొదళ్లు పారలతో కదలగొట్టి యూరియా, పొటాస్, డీఏపి తగు మోతాదుల్లో మొక్క చుట్టూ వేస్తారు. ప్రస్తుతం అడపా, దడపా వర్షాలు పడడం వల్ల భూముల్లో చేరిన నీటి పదును వల్ల వినియోగించిన ఎరువులతో పంటలు అభివృద్ధి చెందుతాయని రైతులు తెలిపారు.

# గుడివాడ సేవలు చిరస్మరణీయం



దిబ్బిడిలో గురునాథరావు జయంతి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



బీసీ హాస్టల్ విద్యార్థినులకు స్వీట్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజు, తదితరులు

**బుచ్చెయ్యపేట :** దివంగత నేత మాజీ ఎంపీ గుడివాడ గురునాథరావు పేద ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలు మరువలేనివని మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు అన్నారు. శనివారం దిబ్బిడిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పల్లె గ్రామాల్లో రోడ్లు, పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, రైతు సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి గురునాథరావు అన్నారు. చిన్నతనంలోనే రాజకీయాల్లోకి వచ్చి తన వాక్ చాతుర్యంతో ప్రజలను ఆకట్టుకుని నేటి యువతకు రాజకీయాలు పట్ల ఆకర్షితులయ్యేలా చేశారన్నారు. కేక్ కట్ చేసి పలువురికి స్వీట్లు పంచి పెట్టారు. వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు జోగా కొండబాబు, పెదిరెడ్ల మాణిక్యం, గోపిశెట్టి శ్రీను, ముచ్చకర్ల అప్పారావు, గొలజాన శ్రీను, గొంపా అప్పారావు, శ్రీను, పాతాళ సత్తిబాబు, గుడాల ఆనంద్, భూషణం పాల్గొన్నారు.

**రావికమతం:** మండల కేంద్రంలో దివంగత నేత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు 70 వ జయంతి వేడుకలను మండల వైఎస్సార్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మి నాయుడు, ఎంపీపీ పైల రాజు, మండల వైఎస్సార్‌పార్టీ కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, మాజీ జెడ్పీటీసీ ఆసరి వాసుగోవిందరావు, పార్టీ నాయకులు సమక్షంలో వైఎస్సార్ పార్టీ సర్పంచ్, ఎంపీటీసీలు, కార్యకర్తలు సమక్షంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు పేదల వర్గాల అభ్యున్నతికి అన్ని విధాలా కృషి చేశారన్నారు. నేటికీ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా కళ్యాణపులోవ రిజర్వాయర్‌కు ఆయన పేరు నామకరణం చేశారు అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తదనంతరం బీసీ హాస్టల్‌లో పిచ్చికుక్క దాడిలో గాయపడిన విద్యార్థినులను పరామర్శించారు. వారికి పండ్లు,రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీలు ఫ్లోర్ లీడర్ పూడి దేవ, గరల్స్ హైస్కూల్ చైర్మన్ అప్పలనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రసాద్, రమణబాబు, సత్యప్రసాద్, గంటా ఈశ్వరరావు, నర్సింహులు పాల్గొన్నారు.

**చోడవరం :** మాజీ మంత్రి, దివంగత గుడివాడ గుర్నాథరావు జయంతిని చోడవరంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గురునాథరావు రాజకీయ జీవితంలో ప్రజలకు ఎంతో సేవచేశారని, ఆయన కృషితో ఉమ్మడి విశాఖజిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు అన్నారు. ఆయన ఆశయాలతో తామంతా రాజకీయాల్లో ఉంటూ వైఎస్సార్‌సీపీ ద్వారా ప్రజలు సేవ చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు అప్పారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నర్సింగరావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నిన వెంకట్రావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామ్మూర్తి, మండల యూత్ అధ్యక్షుడు పల్లా ధనాజీ, మండల ఉపాధ్యక్షుడు చవితిన బాబూరావు, పట్టణయూత్ అధ్యక్షుడు గూనూరు రాజు, సర్పంచ్ శిరుచోళ్ల గణపతినాయుడు పాల్గొన్నారు.

## సృజనాత్మకతతో నైపుణ్యానికి మెరుగులు

**కె.కోటపాడు :** విద్యార్థి దశ నుండే సృజనాత్మకత వైపు విద్యార్థులు అడుగులు వేయడం వల్ల వారిలో విజ్ఞానం మెరుగుపడుతుందని మండల విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ అన్నారు. మండలంలో ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రోబోటిక్స్‌పై వర్క్‌షాపు ముగిసింది. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు స్టెమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ద్వారా రోబోలు పని చేయు విధానం గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు సొంతంగా ప్రోగ్రాంను తయారు చేసి సెన్సార్ రోబోట్‌లను గమ్యం దిశగా నడిపి విజయవంతం అయ్యారు. భవిష్యత్‌లో రోబోలు నిత్యజీవితంలో ఏ విధంగా ఉపయోగపడతాయో ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఎ.శేఖర్, పాఠశాల ఏటిఎల్ ఇన్‌చార్జ్ సూర్రెడ్డి బాబూరావు, బొడ్డు శివప్రసాదరావు, పీఈటీ కె.చిట్టి ప్రసాద్ పాల్గొన్నారు.



నమూనాలను తయారు చేసిన విద్యార్థులతో ఎంఈవో సత్యనారాయణ, హెచ్‌ఎం శేఖర్

# కమ్ముకున్న పొగమంచు



కొత్తపాలెం మార్గంలో మంచు కమ్మేసిన దృశ్యం



చంద్రయ్యపాలెం వద్ద పంట పొలాల్లో మంచు

**గొలుగొండ :** మంచు మైదానాన్ని కమ్మేసింది. శనివారం తెల్లవారి నుంచి గొలుగొండ మండలం జోగుంపేట, చంద్రయ్యపాలెం, కొత్తపాలెం, బుడ్డడపాడు తదితర గ్రామాల్లో దట్టంగా మంచు కురిసింది. రోడ్డుపై కమ్మేయడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. చలి ప్రభావం లేకపోయినా మంచు దట్టంగా కురవడం ప్రారంభం కావడం జరిగింది. మంచు ప్రారంభం కావడంతో ఇటుగా వెళ్లే వారు మంచు కురవడం చూసి ఆనందం వ్యక్తం చేశారు.

## వరి పంటకు చీడపీడలతో రైతుల ఆందోళన

**మాడుగుల రూరల్:** ఖరీఫ్ వరి పంటకు వివిధ రకాలు చీడపీడలు సోకుతున్నాయి. వరినాట్లు వేసి, సుమారు రెండు మాసాలు పూర్తి అయింది. వరి పంటకు పాచి తెగులు, ఎర్ర తెగులు, తెల్లదోమ సోకడంతో రైతులు పంటకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ప్రధానంగా సాంబమసూరి వరి రకం పంటకు ఎక్కువగా తెగుళ్ల సోకుతున్నాయని రైతులు పేర్కొన్నారు. గ్రామాల్లో వరి పంటకు సోకుతున్న వివిధ రకాల చీడపీడలకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో గల వీఏఏలు, వీహెచ్ఏలు క్షేత్ర స్థాయిలో పర్యటించి, రైతులకు తగు వ్యవసాయ సూచనలు అందించాలని రైతులు కోరుతున్నారు.



కె.జె.పురంలో వరి పంటకు తెగుళ్ల సోకకుండా స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం